ఆంధ్రభూమి

Published on *Andhra Bhoomi* (http://www.andhrabhoomi.net)



# దిల్ మిల్..

March 22nd,2011

దిల్ మిల్ అంటే ఏదో హిందీ సినిమాలోని హీరో హీరోయిన్ల మధ్య జరిగే ప్రేమ సన్నివేశంలో పాడేపాట అనుకుంటే పొరపాటే! దిల్ అంటే Daughter-in-law, మిల్ అంటే Mother-in-law, వీరిద్దరి కలయికా ఏమంత రొమాంటిక్‌గా ఉండదు. యుగయుగాల నుండీ వీరిద్దరి మధ్యా ఉండే సంబంధ బాంధవ్యాల గురించి ఎనె్నన్నో కథలు వచ్చాయి. సినిమాలు వచ్చాయి. ఇప్పుడైతే టి.వి. చానెళ్ళ ధర్మమా అని, అన్ని భాషల్లోనూ సీరియళ్ళు హోరెత్తించేస్తున్నాయి. నా అనుమానమేమంటే, వీళ్ళిద్దరూ అసలు పూర్వ జన్మలో ఏ గంధర్వ కన్యలో అయి ఉంటారు. స్వర్గంలో ఏదో తప్పు చేయడంవలన ఏ ఇంద్రుడో, ఎవరో శాపం ఇచ్చి ఉంటారు. పొండి భూలోకంలో రెండు పాత్రలు పోషించి, జీవితాంతం కొట్టుకుంటూ ఉండండి అని శాపం ఇచ్చేసుంటారు. మామూలుగా అయితే, ప్రతీ శాపానికీ ఏదో ఒక విమోచనం కూడా ఉంటూంటుంది. కానీ ఈ ఇద్దరు గంధర్వులకి అలాంటి విమోచనా మార్గం ఉన్నట్లు లేదు. దీనివలన జరిగేదేమయ్యా అంటే, కలియుగాంతం వరకూ వీరిద్దరి మధ్యా యుద్ధం చూడాల్సిందే. ఆ ప్రాణులే మన కథల్లోని దిల్లూ మిల్లూ! ఇదివరకటి రోజుల్లో అత్తా కోడళ్ళు కొట్టుకునేదేదో, ఏమీ దాచుకోకుండా, వీధిన పడి కొట్టుకునేవారు. ఒకళ్ళతో ఒకళ్ళు కొట్టుకున్నా సరే, కలిసిపోయేవారు. ఇప్పుడు అంతా ఆధునికం. సొసైటీలో తమ ఇమేజ్ పాడవకుండా కూడా చూసుకోవాలి. మరి ఇప్పుడు అంతా ప్రచ్ఛన్న యుద్ధం. దెబ్బ కనిపించకుండగా కొట్టడం. అదేదో పోలీసులు థర్డ్ డిగ్రీ ఉపయోగిస్తుంటారే అలాగన్న మాట! పెళ్లైన పదహార్రోజుల పండుగ అవడం తరువాయి. ఒకళ్ళనొకళ్ళు ఎస్టిమేట్ చేసేసుకుంటారు. ఇంటిపెద్ద గారికి ఏ ఆస్తిపాస్తులైనా ఉన్నారుా అంటే మరీ వీధిన పడరు. లేకపోయాయా అంతే సంగతులు. ఇది వరకటి రోజుల్లోలాగ ఒకళ్ళమీద ఒకళ్ళు ఏమీ అరుచుకోరు. అంతా సెటిల్! అత్తగారేమో, అనేనళ్లు తన సామ్రాజ్యంలోకి ఎవరినీ అడుగెట్టనీయకుండా, సార్వభౌమాధికారంతో పరిపాలించినావిడ. ఇప్పుడు కోడలు వచ్చింది. ఈవిడేమో అంతా పాతచింతకాయ పచ్చడాయె. ప్రతీ అత్తగారికీ, ఇంకోళ్లెవరైనా తనవంటింట్లోకి అడుగు పెట్టారా, తన హక్కేదో తీసేసుకున్నట్లు బాధ పడిపోతుంది. అసలు చిలక ప్రాణమంతా ఆ వంటింట్లోనే ఉంది. అందువలన కొత్తగా వచ్చిన కోడలి మొదటి ఆక్రమణ అక్కడే. అలాగని తనకేదో పాకప్రావీణ్యం ఉందని కాదు. ఎలాగోలాగ అత్తగారిని, అక్కడ నుంచి తప్పించగలిగితే, మిగిలినవన్నీ నల్లేరుమీద నడకే కదా! ఇన్నాళ్లూ ఎంతో శ్రమపడి చేశారూ, కోడలొచ్చిన తరువాతైనా సుఖపడకపోతే ఎలాగా? అనే సున్నితమైన దెబ్బతో ప్రారంభం అవుతుంది. కొత్తకోడలి కొత్త భర్త కూడా అవును కదూ నిజమే మరీ అనుకుంటాడు. అమ్మకి వంటపని తప్పించడం అనే ప్రస్తావన ఆ వెర్రిబాగులకొడుకే చేస్తాడు. ఈ రోజుల్లో భార్యాభర్తా సంపాదిస్తున్నప్పుడు ఓ వంట మనిషిని పెట్టుకోవడం ఏమీ పెద్ద విశేషం కాదు. పైగా ప్రొద్దుటే ఆఫీసులకి వెళ్లేముందే బ్రేక్ ఫాస్టులూ, లంచ్‌కి ఓ బాక్సూ కూడా తయారవ్వాలి. మరి ఇనే్నసి పనులకి అత్తగారిని కష్టపెట్టడం ఏం భావ్యంగా ఉంటుందీ? ఈ ఒక్క కారణమూ చాలు అమ్మని ఒప్పించడానికి. 'మైమేరా ఝూంసీనహీ ఛోడేంగీ' అని ఝూన్సీ లక్ష్మీబాయి అన్నట్లుగా పాపం, ఈ అత్తగారు తన శాయశక్తులా ప్రయత్నం చేస్తుంది. అంత వీరనారి లక్ష్మీబాయ్ చివరికి ఝూన్సీ వదిలిందా లేదా, ఈవిడెంత? ఆఫ్ట్రాల్, అత్తగారనబడే మామూలు ప్రాణి. ట్రాన్స్ఫర్ ఆఫ్ పవర్‌కి మొదటి అడుగు పడ్డట్టే! ఇంక మెల్లి మెల్లిగా స్లో పాయిజనింగు ప్రారంభమవుతుంది. అలాగని ఏదో ప్రాణహారకం అనుకోవద్దు. చిన్న చిన్న ఝులక్కులు ప్రారంభం అవుతాయి. ప్రొద్దుటే తినే బ్రేక్ ఫాస్టుకి ఏ చపాతీలో, పుల్కాలో, లంచ్ బాక్సుకి కూడా ఉపయోగిస్తాయనే వంకతో చేయించడం. పోనీ ఇంట్లో పెద్దాయన ప్రతీ రోజూ ఈ చపాతీలు అవీ తినలేకపోతున్నాడని, ఒక్కరోజుకైనా మెనూ మార్చి, ఏ ఉప్మాయో చేయించమంటే 'ఈ వయస్సులో అంతంత పోపులు పెట్టి ఉప్మాలు, పెసరట్లూ తింటే ఆలోగ్యం పాడైపోదూ' అంటూ సన్నాయి నొక్కులూ...

ఆ పనిచేసే వంటావిడ ఈ పెద్దావిడ మాటెందుకు వింటుంది? జీతమిచ్చే కోడలి మాట వింటుంది కానీ... ఒకసారి

చేతిలోంచి జారిపోయిన తరువాత మళ్లీ రావడం అంత తేలికేమీ కాదు.
ఏదో ఈ పెద్దాళ్ళకి కాలక్షేపం కోసం టి.వి చూడాలని ఉంటుంది. ఇంట్లో ఎవరైనా టి.వి చూస్తుంటూంటే పిల్లలు తప్పనిసరిగా ఆ చుట్టుపక్కలే తిరుగుతుంటారు. మరి వాళ్ళున్నప్పుడు ఈ పెద్దవాళ్ళు వాళ్ళ సీరియల్స్ చూసుకోలేరు కదా. ఇంకో గత్యంతరం లేక ఏ కార్టూన్ ఛానెలో బలవంతంగా చూడాల్సొస్తుంది. కోడలు మాత్రం అత్తగారు పడుతున్న బాధని చూస్తూ ఆనందిస్తుంటుంది. ఇలా ఒకటేమిటి? ఎన్నెన్నో విషయాల్లో అత్తగారిమీద విజయాలు సాధిస్తూనే ఉంటుంది. ఇలాంటి విషయాలు చెప్పుకోలేరూ.. చివరికి కన్న కొడుకుతో మాత్రం ఏం పితూరీ చెప్తారు? ''ఏరా మీ ఆవిడ మమ్మల్ని ఇలా క్షోభ పెడుతోంది.. నోటికింపుగా తిండి ఉండడం లేదు. చివరికి మీ నాన్నగారే కొనిపెట్టిన టి.వి. చూసే స్వాతంత్ర్యం కూడా లేదు'' అని ఏ తల్లిమాత్రం చెప్పుకుంటుంది? ఏమో అలా చెప్పగలిగితే ఆ కొడుకేదైనా పరిష్కారం చూపించేవాడేమో? కోడలికి తెలుసు అత్తగారికి అంత ధైర్యం లేదని. అదేం ఖర్మమో కానీ, మన దేశంలో చట్టాలు కూడా కొత్తకోడలికి అనుకూలంగానే ఉన్నాయి. కోడలికి ఏమైనా అయితే ముందుగా అత్తగారిమీద కేసు పెడతారు. కానీ అదే కోడలు అత్తగారిని ఎన్ని విధాలా సాధించినా కోర్టూ లేదూ.. కేసూ లేదు.. ఎటూ చూసినా 'దిల్'దే అంతిమ విజయం.

మీరేమంటారు?
నాణేనికి ఎప్పుడూ రెండు పార్శ్వాలుంటాయి. ఈ వ్యాసం చదివితే నిజమే కావొచ్చు... అనిపించొచ్చు.. అబ్బే ఇది సరికాదు... అనీ అనిపించొచ్చు... అందుకే మీరేమంటారో వారం రోజుల్లోగా రాసి పంపొచ్చు. నిడివి మరీ ఎక్కువ కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీదే.
-ఎడిటర్

**Source URL:** http://www.andhrabhoomi.net/priyadarshini/main-feature-620

**Links:**
[1] http://www.andhrabhoomi.net/sites/default/files/article/dil.jpg